కాంగ్రెస్‌కు తెలంగాణ రెడ్డి సంఘం మద్దతు



మాట్లాడుతున్న రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, విజితారెడ్డి

నల్లకుంట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసారు మొరపెట్టుకున్నా రెడ్డిల సంక్షేమాన్ని పట్టించుకోలేదని తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దుల వెంకటేశ్వర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని కులాల మాదిరి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం హర్షనీయమన్నారు. అందుకు కృతజ్ఞతగా లోక్‌సభ ఎన్నికల్లో పార్టీలకతీతంగా కాంగ్రెస్‌కు తమ సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. సోమవారం నల్లకుంటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం అధ్యక్షురాలు దేవిరెడ్డి విజితారెడ్డితో కలిసి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో రెడ్డి సామాజిక వర్గం పూర్తిగా అణచివేతకు గురయ్యిందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు పాది యాదగిరి రెడ్డి, భూదాన్ సాగర్ రెడ్డి, చెన్నేపల్లి లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్. హరినాథ్ రెడ్డి, సి.బాల వర్ధన్‌రెడ్డి, దేప తిరుపతి రెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

మున్నూరుకాపు అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి



సభ్యులను సన్మానిస్తున్న మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న మున్నూరుకాపు అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు యువకమండలి కన్వీనర్ కోల మోహనకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. సోమవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో జరిగిన సమావేశంలో నూతనంగా ఏర్పడిన అడహక్ కమిటీ సభ్యులను తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాధికారం ద్వారానే కులాభివృద్ధి జరుగుతుందని, ఆ దిశగా మున్నూరుకాపు అభ్యర్థులను గెలిపించుకుంటే మన కుల సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరికెల వంశీ, ఏనుగుల సాయి, గడెకర్ల చాణక్య, శేరి సతీష్, మహాసభ కోశాధికారి లింగిశెట్టి హనుమంతరావు, ఏనుగుల మాణిక్ ప్రభు, కొండూరు వినోద్ కుమార్, గడ్డి చంద్రశేఖర్, గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

- వడ్డెర సామాజిక అభివృద్ధికి వైఎస్సార్ బాటలు వేశారు
- బీఆర్‌ఎస్ బీసీల ద్రోహి
- జాతీయ వడ్డెర సంక్షమ సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్



వేముల వెంకటేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఒడ్డెర సామాజిక సంఘం కృషి చేస్తుందని జాతీయ వడ్డెర సంక్షమ సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ స్పష్టం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వడ్డెర సామాజిక వర్గం అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. మైనింగ్‌లో 20 శాతం వాటా కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. వడ్డెర ఫెడరేషన్‌కు నిధులు కేటాయించి ఆర్థిక బలోపేతానికి కృషి చేశారన్నారు. స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ రిజర్వేషన్‌లు కల్పించారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తమ సామాజికవర్గం మరింతగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ బీసీల ద్రోహి అని, బీసీలకు బీజేపీ చేసింది ఏమీలేదని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ మైనింగ్‌లో వాటా ఇవ్వకుండా వడ్డెరులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో వడ్డెరులకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలిపామని అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మద్దతు ఇస్తామని తెలిపారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి న్యాయకత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

కార్పొరేట్లకు దాసోహం అంటున్న బీజేపీని ఓడించండి

హిమాయత్‌నగర్: రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్ విజ్ఞప్తి చేశారు. నారాయణగూడలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేసి లక్షలాది మంది పౌరులకు ఉద్యోగావకాశాలు కల్పించాయన్నారు. ఇప్పటికీ లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి ఉద్యోగావకాశాలు లేకుండా చేసిందని మండిపడ్డారు. ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎం.బి.విజయ్ కుమార్, కార్యదర్శులు ఎస్.నరసింహారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్, ఐఎన్టీయూసీ రాష్ట్ర నేతలు ఎం.రమేష్ గౌడ్, ఎం.రాజేందర్ రెడ్డి, కె. ఉపేందర్, బి.రామకృష్ణ రెడ్డి, శంకర్ నాయక్, డి.మహేష్, బి. వీరన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ టీకా బాధితులకు పరిహారం అందించాలి

సాక్షి, సిటీబ్యూరో: కోవిడ్ టీకా వేసుకోవడం వల్ల ఎంత మందికి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చాయనే సమాచారాన్ని సేకరించి, వారికి తగిన నష్టపరిహారం అందించాలని అవేకన్ ఇండియా మూమెంట్ ప్రతినిధులు సరస్వతి, నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... టీకా వేసుకున్న తరువాత ఆరోగ్య సమస్యలు ఎదురైతే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. టీకా వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని 2021లోనే గుర్తించినప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తయారీదారులే సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని ఒప్పుకుంటున్నారని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో వైద్యులు సురేందర్ రాజు, సుధ పాల్గొన్నారు.





దానంకు మద్దతుగా..

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార కార్యక్రమం సోమవారం సందడిగా సాగింది. అంబర్‌పేట తిలక్‌నగర్ నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల రోడ్ షో, కార్నర్ మీటింగ్ జరిగింది. కార్యక్రమంలో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

–అంబర్‌పేట

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి

- ఈసీఐఎల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో కొనసాగిన ప్రక్రియ
- భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు



ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ లోడింగ్ చేసిన దృశ్యం

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈవీఎంలలో అభ్యర్థి పేరు, ఫొటో గుర్తుతో కూడిన బ్యాలెట్ పేపర్‌ను లోడింగ్ చేసే ప్రక్రియ పూర్తి చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల కమిషనింగ్ (బ్యాలెట్ కాగితం అమర్చడం, నమూనా పోలింగ్) ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఖైరతాబాద్ అసెంబ్లీ సహాయ రిటర్నింగ్ అధికారులు హేమంత్ బోర్కాడే, ప్రశాంతి, అనితారెడ్డిలతో పాటు 150 మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ కాగితం ఈవీఎంలలో అమర్చే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 245 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇందుకోసం 2.99 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 45 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా నోటాతో కలిసి 46 గుర్తులను బ్యాలెట్ పేపర్ల ద్వారా ఈవీఎంలను అమర్చారు.

- ఈసీఐఎల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఏజెంట్ల ఆధ్వర్యంలో కమిషనింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ మంగళవారం కూడా కొనసాగనుంది.
- ఈవీఎంలో భాగాలైన బ్యాలెట్ యూనిట్‌కు 3, కంట్రోల్ యూనిట్ 3, వీవీ ప్యాట్‌కు 3 చొప్పున పోలింగ్ కేంద్రం చిరునామా ట్యాగ్‌లను అమర్చడం ద్వారా ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా ఈసీఐఎల్ ఇంజినీర్లు ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను అమర్చడం ప్రారంభించారు.
- అనంతరం ప్రింట్‌ను ఎన్నికల అధికారులు, సహాయ అధికారులు పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్‌లో కాగితాన్ని అమర్చిన తర్వాత వాటికి సీల్ వేశారు. దీని తర్వాత కంట్రోల్ యూనిట్‌లోనూ బ్యాటరీని అమర్చారు.
- ఆ తర్వాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లను సక్రమంగా అనుసంధానం చేశారు. కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆన్‌చేసి నమూనా పోలింగ్‌కు నిర్వహించారు. నమూనా పోలింగ్‌లో భాగంగా ప్రతి అభ్యర్థితో పాటు నోటాకు సైతం ఒక ఓటు చొప్పున వేశారు.
- అనంతరం కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లోని ఫలితాలను పోల్చి చూశారు. నమూనా పోలింగ్ డేటాను, వీవీ ప్యాట్ల చిట్టీలను తొలగించారు.
- కంట్రోల్ యూనిట్‌ను స్విచ్ ఆఫ్ చేసి పేపర్ రోల్‌ను లాక్ చేసి వీవీ ప్యాట్ అనుసంధానాన్ని తొలగించారు.
- మరోవైపు ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ అమర్చే ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిఘా నేత్రాల కింద ఈ ప్రక్రియ జరిగింది. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచారు. కేంద్ర సాయుధ బలగాల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత కొనసాగుతుండగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం చుట్టూ పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్నదానం



ముషీరాబాద్: మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ చిన్నారులకు అన్నదాన కార్యక్రమాన్ని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, పాశం అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మీనాజ్, అమ్జద్ హుస్సేన్, చంద్రకళ, రాందాస్‌గౌడ్, ట్రస్ట్ డైరెక్టర్ లింగాల సాయిశరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ సీఎంకు సన్మానం



ఉత్తరాఖండ్ సీఎంను సత్కరిస్తున్న యశ్వంత్

కాచిగూడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రతినిధులు పుష్కర్ సింగ్ దామిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు.

శేషగిరిరావుకు నివాళి

చిక్కడపల్లి: గన్ మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ శేషగిరిరావుకు పలువురు నివాళులు అర్పించారు. చిక్కడపల్లి పీఎండ్‌టీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన శేషగిరిరావు సంస్మరణ సభలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ నేతలు ఎం.రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్ శ్రీకాంత్, వడ్డపల్లి దినేష్‌రావు, కోళ్ళ సుధాకర్, జగన్, రాజేష్, లక్ష్మీనారాయణ, ప్రఫుల్ రామిరెడ్డి, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నగర అధ్యక్షుడు చిలుకూరి అఖిలేష్, సంఘపాక భాస్కర్ తదితరులు పాల్గొని శేషగిరిరావుకు నివాలులర్పించారు. సోదరులు ఎం.వి.శ్రీనివాస్‌రావు, అశోక్‌కుమార్ తదితర కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభ్యున్నతి



ప్రచారం నిర్వహిస్తున్న గుర్రం శంకర్

చిక్కడపల్లి: కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాలతోపాటు అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఉన్నారు. సోమవారం సాయంత్రం దానం నాగేందర్‌కు మద్దతుగా డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. కరపత్రాలను పంపిణీ చేసి హస్తం గుర్తుకు ఓటు వేసి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నేతలు జయేందర్‌బాబు, గుర్రం శంకర్, గుర్రంచంద్రకళ, అభిషేక్ కెనడీ, బి.యాదగిరిగౌడ్, గుండు జగదీశ్‌బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మార్పీఎస్ నేతల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

చిక్కడపల్లి: సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం గాంధీనగర్ డివిజన్ పరిధిలో ప్రచారం నిర్వహించారు. సబర్మతీనగర్, అరుంధతీనగర్, వీవీ గిరినగర్ బస్తీలలో మాదిగల ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజవర్గం ఇన్‌చార్జ్ గజ్జల రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం జరుగుతున్న ఉద్యమంలో మాదిగలకు అండగాగా ఉంటున్న కిషన్‌రెడ్డి గెలుపుకోసం పనిచేస్తున్నామని వివరించారు. మాదిగలంతా కిషన్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డివిజన్ ఇన్‌చార్జ్ ఇల్లెందుల ఎల్లయ్య మాదిగ, ఎంఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేష్, జానకీరామచౌదరి, వెంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేముల మృతిపై పునర్విచారణ జరిపించాలి

కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి

హిమాయత్‌నగర్: సెంట్రల్ యూనివర్సిటీలో మృతి చెందిన రోహిత్ వేముల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం పునర్ విచారణ జరిపించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బండారి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మృతికి ప్రధాన కారకులను కాపాడేందుకే రోహిత్ వేముల ఎస్సీ కాదని కోర్టు కేసును కొట్టివేసిందన్నారు. రోహిత్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు వై.రత్నం, జి.విజయ్‌లతో కలిసి బండారి లక్ష్మయ్య మాట్లాడారు. రోహిత్ ముమ్మాటికీ దళితుడే అని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేముల రోహిత్ మరణంపై పునర్ విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. అతడు దళితుడే అని రుజువు ఆవుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అతని మరణంపై పోలీసులు కూడా సరైన విచారణ జరిపించలేదన్నారు. కార్యక్రమంలో పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజు, జె.చక్రవర్తి, చైతన్య భారతి, గోస్వామి, ప్రజ్వల్ పాల్గొన్నారు.

ప్రముఖులకు అవార్డుల ప్రదానం



కళాకారులు, ప్రముఖులతో విశ్రాంత ఐఏఎస్ విష్ణు తదితరులు

చిక్కడపల్లి: అంతర్జాతీయ నాట్య దినోత్సవం సందర్భంగా ది డాన్స్ ఇండియా మ్యాగజైన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో తెలంగాణ స్టేట్ అవార్డుల ప్రదానోత్సవం సోమవారం రాత్రి జరిగింది. విశ్రాంత ఐఏఎస్ వి.ఎస్. విష్ణు ముఖ్య అతిథిగా హాజరై ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. వర్ధమాన కళాకారులు ప్రేక్షకరంజకంగా నృత్యాంశాలను ప్రదర్శించారు. ప్రముఖులు ఉమామహేశ్వరి, సంగీత, కళాకృష్ణ, పసుమర్తి, శేషుబాబు, యశోదా ఠాకూర్, రఫీ, సంజాయ్‌జోషి, మంతా శ్రీనివాస్, మధుసూదన్, మంజుల, సోను, మృత్యుంజయశర్మ, లక్ష్మీప్రియ, విక్రమ్‌కుమార్, ఎం.భారతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

హిమాయత్‌నగర్: హాస్టళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఓ యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్‌ఐ జి.వెంకటేశ్ సమాచారం మేరకు... కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లాలోని ధనూర్ ప్రాంతానికి చెందిన నీరజ్ కుమార్, అలియాస్ సోను(21) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి బర్కత్‌పుర, విక్రంనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వృత్తి రీత్యా కారుడ్రైవర్. ఇటీవల నారాయణగూడలోని అక్షయ్ హాస్టల్ ఆవరణంలో ఉన్న ఓ హోండా యాక్టీవాను దొంగిలించాడు. ఆ హాస్టల్‌లో ఉండే ప్రీతి అనే యువతి తన హోండా యాక్టీవా హాస్టల్ ఆవరణంలో పార్కు చేసి తన స్వగ్రామానికి వెళ్లింది. తన యాక్టీవాను తన స్నేహితుడికి అప్పగించాలని హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి చెప్పింది. పార్కు చేసిన స్థలంలో వాహనం కన్పించకపోవడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి బైక్ చోరీ చేసిన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాంకోఠిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నీరజకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడి నుంచి రెండు యాక్టీవా వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కాచిగూడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం అంబర్‌పేట నియోజకవర్గం నల్లకుంటలో చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోకు జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, సీనియర్ కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు నేతృత్వంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. సికింద్రాబాద్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని ఈ సందర్భంగా దిడ్డి రాంబాబు ప్రజలకు పిలుపునిచ్చారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూరేపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రలోభాలకు లోనుకాకుండా విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. నిజమైన ప్రజాసేవకులనే గెలిపించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు బైరి శ్రీనివాస్, జాతీయ నేత చింతకింది జానయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ఆపాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధోన్మాదాన్ని వెంటనే ఆపాలని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో అమెరికా యూనివర్సిటీలో విద్యార్థుల పోరాటం, పోలీసుల నిర్బంధం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ... శాంతిని నెలకొల్పి పాలస్తీనా ప్రజల హక్కులను రక్షించాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్‌రావు, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.అన్మేష్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు స్వరూప, పీవైఎల్ అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, ఊయ్యాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా సయ్యద్ మోహినొద్దీన్



ముషీరాబాద్: టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది సయ్యద్ మోహినొద్దీన్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన అశోక్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. మేధావులంతా కాంగ్రెస్‌కు అండగా నిలిచేలా బాధ్యతాయుతంగా పని చేస్తామని పేర్కొన్నారు.

దోపిడీ కేసులో నిందితులకు జరిమానా

కాచిగూడ: దోపిడీ కేసులో నలుగురు నిందితులకు సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం..12 జూలై 2020లో తలాబ్‌కట్టకు చెందిన అమీర్‌ఖాన్ యాకుత్‌పుర రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతుండగా యాకుత్‌పురాకు చెందిన సోహైల్ (25), ఫయాజ్ (23), ఇస్మాయిల్ (28), అజారుద్దీన్ (25)లు అతనిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు, రూ.2వేలు లాక్కుని పారిపోయారు. బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమగ్ర దర్యాప్తు అనంతరం రైల్వే కోర్టు కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి 2వ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ సికింద్రాబాద్ రైల్వే కోర్టులో అభియోగ పత్రం సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రోజారాణి వాదనలు వినిపించారు. న్యాయమూర్తి ఎం.డి.గౌస్‌పాషా నిందితులకు ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపారు.

మొబైల్‌కు లింక్ పంపి.. రూ. 3.47 లక్షలు కాజేసి

హిమాయత్‌నగర్: మెసేజ్ ద్వారా ఓటీపీ లింక్ పంపించి ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సమాచారం మేరకు... నగరానికి చెందిన 30 ఏళ్ల వ్యాపారి మొబైల్ నంబర్‌కు నాలుగు ఓటీపీలతో కూడిన ఎస్ ఎమ్ ఎస్ లింక్ వచ్చింది. బాధితుడు లింక్‌ను ఓపెన్ చేసి వెబ్‌సైట్‌లోకి వెళ్లాడు. అనంతరం అతనికి తన ఎస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ ఐపిన్ విజయవంతంగా మార్చబడిందని సందేశం వచ్చింది. అనంతరం వివిధ ఈ కామర్స్ వేదిక నుండి తన యస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నుంచి డబ్బు డెబిట్ అయిందని సందేశాలు వచ్చాయి. ఈ విధంగా బాధితుడి నుంచి విడతల వారీగా ఆటో పే ద్వారా మొత్తం రూ. 3.47 లక్షలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. మోసపోయానని నగర సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

ఇంటింటికీ బీజేపీ ప్రచారం



ప్రచారం చేస్తున్న కన్నె రమేష్ యాదవ్

కాచిగూడ: బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆపార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ సోమవారం కాచిగూడ డివిజన్, పోలింగ్ బూత్ నెంబర్:209లో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. కిషన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ప్రకాష్‌రెడ్డి, ఫంకజ్, దీపక్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అడిక్‌మెట్‌లో 'ఇంటింటికీ బీజేపీ'

ముషీరాబాద్: ఘర్‌ఘర్ మోదీ కార్యక్రమంలో భాగంగా అడిక్‌మెట్ డివిజన్ రామాలయం వీధిలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు రోయ్యూరు శేషసాయి ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి కరపత్రాలు పంచుతూ మరోసారి మోదీని ప్రధాన మంత్రి చేయడానికి బీజేపీకి ఓటు వేయాలని కోరారు.



కరపత్రాలు పంచుతున్న శేషసాయి